క్లుప్తంగా

రైతులకు ఇబ్బందుల్లేకుండా కొనుగోళ్లు

● ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ సునీల్‌కుమార్


మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడతామని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆమిటి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి చింతల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు లక్ష్యం దాదాపు పూర్తయిందన్నారు. అయితే కొంతమంది రైతుల వద్ద ఇంకా ధాన్యం మిగిలి ఉండడంతో కొనుగోలుకు చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో లవకుమార్, సచివాలయ కార్యదర్శి వి.హరి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మిగులు ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం

బాడంగి: రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఏఓ కె. శిరీష అన్నారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, మండలంలో పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కాగా... తొలివిడతగా 7,850 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. మిగిలిన 2,278 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని చెప్పారు.

సైబర్ మోసాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

వంగర: ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని బాగెంపేట గ్రామంలో సోమవారం సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఓటీపీ, లోన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే నష్టపోతారని వివరించారు.

కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యం


బొబ్బిలి: కుష్ఠువ్యాధి నివారణే ప్రభుత్వ లక్ష్యమని పిరిడి సర్పంచ్ తుట్ట వరలక్ష్మి అన్నారు. పిరిడి గ్రామ సచివాలయం పరిధిలో లెప్రసీ నివారణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్ఠులేని సమాజాన్ని నిర్మిద్దామన్న నినాదంతో అన్ని పీహెచ్‌సీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో 15 రోజుల పాటు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో పిరిడి పీహెచ్‌సీ పర్యవేక్షక సిబ్బంది, ఎంపీహెచ్ఈఓ బి. నారాయణరావు, ఎంపీహెచ్ఎస్ జి. రవికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం


కళాకారులను సత్కరిస్తున్న గ్రామస్తులు

సంతకవిటి: మందరాడ గ్రామంలో మజ్జిగౌరీ నాట్య కళామండలికి చెందిన శివభాగవతం కళాకారుల బృందాన్ని అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ లెంక జగన్ సత్కరించారు. రెండు రోజులుగా గ్రామంలో మజ్జిగౌరీ ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి కళాకరుల బృందం శివభాగవతం ప్రదర్శించారు. అనంతరం వారిని ప్రోత్సహిస్తూ నగదు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బృందం ఆర్గనైజర్ వావిలపల్లి రమణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నాగదేవత ఆలయ వార్షికోత్సవం


నాగదేవత పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజాం: మొగిలివలస గ్రామంలో నాగదేవత ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నాగదేవత విగ్రహానికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళులు..


తెర్లాం: శాఖా గ్రంథాలయంలో గాంధీజీ వర్ధంతి


బాడంగి: పింద్రంగివలసలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తుల


మెంటాడ: మాట్లాడుతున్న గంద్రేటి అప్పలనాయుడు


బొబ్బిలి: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

● వాడవాడలా గాంధీ వర్ధంతి

బొబ్బిలి: నియోజకవర్గ వ్యాప్తంగా జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొబ్బిలి పట్టణంలో గల గాంధీ బొమ్మ సెంటర్‌లో గల మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం అందించిన గొప్ప మహనీయుడు గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, కౌన్సిలర్లు చోడిగంజి రమేష్‌నాయుడు, పాలవలస ఉమా శంకర్, బొత్స రమణమ్మ, జేసీఎస్ బొబ్బిలి ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు శాఖా గ్రంథాలయంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయుడు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో..

బాడంగి: మండలంలోని అంబేడ్కర్ గురుకులంలో పాటు పింద్రంగివలసల్లో గాంధీజీకి ఘన నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గురుకులం ప్రిన్సిపాల్ రామ్‌దాసు, సామాజిక కార్యకర్త రౌతు సురేష్, రావాడ తిరుపతి, కొత్తల నారాయణ, రామినాయుడు, గౌరునాయుడు, వెంకటరమణ, సింహాచలం, కృష్ణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషిచేద్దాం..

మెంటాడ: అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంద్రేటి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీడీఓ త్రివిక్రమ్, స్థానిక పెద్దలు రెడ్డి రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: గాంధీ వర్ధంతి సందర్భంగా మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దాసరి కృష్ణారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.


సంతకవిటి: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం, తదితరులు

మృతుల కుటుంబాలకు పరామర్శ


రాజాం సిటీ: గోవిందరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రాజాం సిటీ: పట్టణానికి చెందిన విశ్రాంత ఇంజినీర్ వాకముళ్ల గోవిందరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం గోవిందరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అతని కుమారుడు ప్రసాద్, కుమార్తెలు లీలా, మాలతిలను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, కె.సుదర్శనరావు, బండి తమ్మినాయుడు తదితరులు ఉన్నారు.

గడే కుటుంబానికి పరామర్శ

రేగిడి: సంకిలి గ్రామానికి చెందిన గడే సత్యారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. సత్యారావు భార్య సత్యవతి, కుమారులు రవి, సురేష్‌లను ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, రాయపురెడ్డి శ్రీకాంత్ దితరులు ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


ఔట్‌రీచ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ


సంతకవిటి: మిర్తివలసలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వంగర: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఎంపీడీఓ బి.హెచ్.శంకరరావు అన్నారు. మండలంలోని వంగర, ఎం.సీతారాంపురం సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగితెలుసుకున్నారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని లబ్ధిదారులు సచివాలయాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మిర్తివలస, మండాకురిటి, సంతకవిటి తదితర గ్రామాల్లో జరుగుతున్న సిటిజన్ ఔట్ రీచ్ సర్వేని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సోమవారం పరిశీలించారు. అర్హులకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడి పథకాల పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

వంగర: కె.కొత్తవలస గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు వేమకోటి రమాకాంత్‌శర్మ తెలిపారు. వేకువజామున శుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు అనంతరం స్వామివారి కల్యాణోత్సవం, తిరువీధి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించాలని కోరారు.

చురుగ్గా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే


రామభద్రపురం వసంతుల వీధిలో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఎంపీడీఓ రామామణి పర్యవేక్షణలో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే సోమవారం చురుగ్గా సాగింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంతమేర లబ్ధి చేకూరిందో తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జోరుగా సర్వే..

బొబ్బిలి: మండలంలోని పిరిడి, కారాడ, కృష్ణాపురం, తదితర గ్రామాల్లో ఎంపీడీఓ భాస్కరరావు ఆధ్వర్యంలో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే కొనసాగింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి పనులు, పీఎంజేవై, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించారు.


బొబ్బిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు, తదితరులు

నేడు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ భవనంలో చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పురపాలక కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. పురపాలక సంఘ అధికారులంతా సంబంధిత సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

రాజాం సిటీ: తెలుకుల కులస్తులంతా ఐక్యమత్యంగా ఉండాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని దేవతెలుకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ సంకిన భవానీ అన్నారు. రాజాంలో అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం నియోజకవర్గస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భవానీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తెలుకుల కులస్తులను పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలుకులను గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు మాట్లాడుతూ ఆర్థికంగా, వృత్తిపరంగా వెనుకబడిన కులస్తులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధుసూదన్, దేవతెలుకుల రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.వీరవెంకటరాజు, డి.సత్యనారాయణ, రాజాం నియోజకవర్గ అధ్యక్షుడు పొట్నూరు గోపి, కె.సూర్యారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

రాజాం సిటీ: మండలంలోని డీఆర్ఎన్‌వలస గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. సోమవారం చేపట్టిన పనులను ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా స్వచ్ఛ సంకల్పం లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తీసి ఆరుబయటకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు సర్పంచ్ కరణం తులసినాయుడు, తదితరులు ఉన్నారు.

వేణుగోపాలుడి ఊరేగింపు


హనుమంతు వాహనంపై వేణుగోపాలస్వామి

బొబ్బిలి: పట్టణంలో కొలువైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని హనుమంతు వాహనంపై సోమవారం రాత్రి ఊరేగించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పాలన


రేగిడి: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని నాయరాలవలసలో సోమవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేదలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంకా అర్హులు ఉన్నట్లయితే వారికి సచివాలయం ద్వారా సంక్షేమ పథకాలు అందజేయనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ పొంద్రంకి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ కొమ్ము శ్రీరాములు, వావిలపల్లి వెంకటరావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

మిశ్రమ దాణాతో అధిక దిగుబడులు


రైతులకు మిశ్రమ దాణా అందజేస్తున్న పశువైద్యాధికారి గోవింద్

బాడంగి: మిశ్రమ దాణాతో అధిక పాల దిగుబడులు వస్తాయని పశు వైద్యాధికారి వి. గోవింద్ అన్నారు. మండలంలోని డొంకినవలస ఆర్‌బీకేను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం 60 శాతం రాయితీపై అందజేస్తున్న టీఎంఆర్ మిశ్రమ దాణాను రైతులు తీసుకుని పశువులకు పెట్టాలని సూచించారు. 200 కిలోల దాణా ధర 3,180 రూపాయలు కాగా 60 శాతం రాయితీపై 1300 రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఒక యూనిట్ దాణా ఒక పాడి ఆవుకు 40 నుంచి 50 రోజుల వరకు సరిపోతుందన్నారు. రైతులు దగ్గరలో ఉన్న ఆర్‌బీకేల్లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య సహాయకుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం


చిరుధాన్యాల స్టాల్స్‌ను తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాజాం: చిరుధాన్యాల సాగుతో రైతులకు తక్కువ సమయంలో మంచి లాభాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయ ఏడీఏ బి.వెంకట శ్రీనివాసాచార్యులు అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో చిరుధాన్యాల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా రైతులు సాగుచేస్తున్న చిరుధాన్యాల పంటలను పరిశీలించారు. అనంతరం చిరుధాన్యాల సాగులో మెలకువలను వారికి వివరించారు. ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్న విత్తనాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చిరుధాన్యాల స్టాల్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క రాజు, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది కె.భారతి, ఆర్.అన్నపూర్ణ, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వై.సంధ్యారాణి, రాజాం ఏడీఏ కె.చంద్రరావు, ఏఓ రేనుకాసాయి, ఏఏబీ చైర్‌పర్సన్‌లు, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం బిల్లులు


వీఏఏలు వద్ద ధాన్యం కొనుగోలు వివరాలు సేకరిస్తున్న ఏడీ చంద్రరరావు తదితరులు

రాజాం: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించిన రైతులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం బిల్లుల చెల్లింపు జరిగిందని వ్యవసాయశాఖ రాజాం ఏడీ చంద్రరావు అన్నారు. మండలంలో బొద్దాం, పొగిరి, నందబలగ తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ధాన్యం పండించిన రైతులతో మాట్లాడారు. ఇంకా రైతులు ఎవరైనా ధాన్యం విక్రయించాలనుకుంటే వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వాటిని అందజేయాలని సూచించారు. అనంతరం ఆర్‌బీకేలను సందర్శించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల వద్ద ధాన్యం సేకరణపై ఆరా తీశారు. ఆయనతోపాటు ఏఓ రేనుకాసాయి, వీఏఏలు ఉన్నారు.